సాక్షి ఆదిలాబాద్

బుధవారం । 15 । అక్టోబర్ । 2025

I

ఆత్మీయం.. ఆదివాసీ వైభవం

ఆదివాసీ గూడేల్లో దండారీ సందడి మొదలైంది. డప్పుల దరువులు, గజ్జెల మోతలు, గుస్సాడీ నృత్యాలతో అడవితల్లి మురిసిపోనుంది. సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా పక్షం రోజుల పాటు సంబరాలు కొనసాగనున్నాయి.

II లో ▸



గరిష్ఠం/కనిష్ఠం
31.0/21.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఉట్నూర్‌రూరల్: విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఈ నెల 21న ఫ్లాగ్‌డే వారోత్సవాల్లో భాగంగా ఉట్నూర్‌లో పోలీస్ అమరవీరుడు ఆర్.శంకర్ స్మారక భవనంను అదనపు ఎస్పీ కాజల్‌సింగ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం సబ్ డివిజన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. యువత గంజాయి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అలాగే పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఉట్నూర్ సీఐ ప్రసాద్, నార్నూర్ సీఐ ప్రభాకర్, అమరవీరుడు శంకర్ భార్య దూరిబాయ్, ఎస్సైలు సాయన్న, ప్రవీణ్, అఖిల్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు ఫ్లాగ్ డే సందర్భంగా పోటీలు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని యువత, విద్యార్థులు, ఔత్సాహిక ఫొటో, వీడియోగ్రాఫర్లకు పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రకటనలో తెలిపారు. షార్ట్‌ఫిల్మ్, ఫొటోగ్రఫీ పోటీల్లో ఎవరైనా పాల్గొనవచ్చని పేర్కొన్నారు. పోలీసుల సేవలు, రోడ్డు ప్రమాదాలు, సైబర్‌నేరాలు, కమ్యూనిటీ పోలీసింగ్, మూఢనమ్మకాలు, ప్రకృతి వైపరీత్యాలు వంటి అంశాలపై మూడు నిమిషాల లోపు నిడివితో వీడియో, ఫొటోలను రూపొందించవచ్చని తెలిపారు. ప్రతిభ కనబర్చిన మొదటి మూడింటికి జిల్లా స్థాయిలో బహుమతులు ప్రదానం చేసి రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 23లోపు ఫొటోలు, వీడియోలను జిల్లా పోలీస్ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. అలాగే విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 6వ తరగతి నుంచి పీజీ వరకు విద్యార్థులు తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. డ్రగ్స్ అంశంపై వ్యాసాన్ని ఈనెల 28లోపు సమర్పించాలని సూచించారు.

'రైజింగ్' సర్వేలో పాల్గొనాలి

కైలాస్‌నగర్: రాష్ట్రాన్ని రానున్న రోజుల్లో అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టేందు కోసం రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ విజన్–2047 డాక్యుమెంట్‌ను రూపొందిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా రూపొందిస్తున్న ఈ డాక్యుమెంట్ రూపకల్పనలో ప్రతిఒక్కరూ భాగస్వాములయ్యేలా ప్రభుత్వం సిటిజన్ సర్వేకు శ్రీకారం చేట్టినట్లు పేర్కొన్నారు.ఈ నెల 25 వరకు కొనసాగే సర్వేలో ప్రతీ ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రదర్శించే క్యూ ఆర్ కోడ్, సర్వే లింక్‌ను ఉపయోగించుకుని సలహాలు, సూచనలు అందించవచ్చని తెలిపారు.

గెస్ట్ లెక్చరర్ల నిరసన

ఆదిలాబాద్‌టౌన్: పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల గెస్ట్ లెక్చరర్లు మంగళవారం ఆందోళన చేపట్టారు. డీఐఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. నెలల తరబడి వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలు అందేలా చూడాలని కోరారు. ఇందులో గెస్ట్ లెక్చరర్లు ప్రియాంక, నీలిమ, లావణ్య, రిజ్వాన బేగం పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సెమినార్‌కు సత్యనారాయణ ఎంపిక



సత్యనారాయణ

జైనథ్: ఎస్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సెమినార్‌కు జైనథ్ మోడల్ స్కూల్ పీజీటీ గోస్కుల సత్యనారాయణ ఎంపికయ్యారు. విద్యార్థుల అభ్యసన తీరు– కెరియర్ ఎంపిక– కౌన్సెలింగ్ ప్రభావంపై హైదరాబాద్‌లోని ఎస్‌సీఈఆర్టీలో గల గోదావరి ఆడిటోరియంలో బుధవారం ప్రదర్శన ఇవ్వనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 25 మంది టీచర్లు పాల్గొననుండగా జిల్లా నుంచి ఈయన ఎంపికయ్యారు.

హక్కుల సాధనకు ఐక్య పోరాటాలు

ఆదిలాబాద్‌టౌన్: ఆశకార్యకర్తల హక్కుల సాధన కోసం ఐక్య పోరాటాలు చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశ కార్యకర్తలపై వివక్ష చూపుతున్నాయని అన్నారు. కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు చిన్నన్న, ఆశ కార్యకర్తలు శోభ, సుజాత, స్వరూప, లక్ష్మి, సరోజ, పాల్గొన్నారు.

స్లాట్‌కు సిద్ధం

- 'కపాస్'యాప్ ద్వారా పత్తి కొనుగోళ్లు
- ఈ సీజన్ నుంచి స్లాట్ బుకింగ్ విధానం
- ఏఈవోలకు పూర్తయిన శిక్షణ
- ఖరారైన జిన్నింగ్ మిల్లులు
- రైతు సంఘాలు, యంత్రాంగంతో కలెక్టర్ రేపు సమీక్ష

జిల్లాలో పత్తి సాగు వివరాలు..
సాగైన విస్తీర్ణం: 4.31లక్షల ఎకరాలు
దిగుబడి అంచనా: 33లక్షల 46వేలు క్వింటాళ్లు
సగటు అంచనా : ఎకరానికి 8 క్వింటాళ్లు
కనీస మద్దతు ధర: రూ.8,110 (8శాతం తేమ)
సీసీఐ కేంద్రాలు : 11
వాటి పరిధిలోని జిన్నింగ్ మిల్లులు : 34

సాక్షి,ఆదిలాబాద్: పత్తి కొనుగోళ్లకు సంబంధించి ఈ సీజన్ నుంచి స్లాట్ బుకింగ్ అమలులోకి రానుంది. ఇప్పటికే ఏఈవోలకు శిక్షణ పూర్తయింది. వారు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించడంతో పాటు అవసరమైతే సాయం అందించనున్నారు. మరోవైపు సీసీఐ కొనుగోలుకు సంబంధించి జిల్లాలో జిన్నింగ్ మిల్లులు సైతం ఖరారయ్యాయి. రేపు రైతులు, యంత్రాంగంతో కలెక్టర్ సమీక్ష నిర్వహించి పత్తి కొనుగోలు తేదీలు ఖరారు చేయనున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లా కేంద్రంలో 19 జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. వీటిని సీసీఐ అద్దెకు తీసుకుంది. ఆదిలాబాద్‌లో సీసీఐకి సంబంధించి రెండు కేంద్రాలు ఉండగా, ఏ-సెంటర్‌లో 9, బి- సెంటర్‌లో 10 జిన్నింగ్‌లు వాటి పరిధిలో ఉన్నాయి. ఈ జిన్నింగ్ మిల్లుల్లో ప్రతిరోజు సుమారు 26వేల నుంచి 30వేల క్వింటాళ్ల వరకు పత్తిని నిల్వ చేసే సామర్థ్యం ఉంది. తద్వారా సుమారు 5వేలకు పైగా బేళ్లను ప్రతిరోజు తయారు చేస్తారు. ఇదిలా ఉంటే.. పత్తి కొనుగోళ్లలో స్లాట్ బుకింగ్ పరంగా సీసీఐ మొదట మూడో వంతు జిన్నింగ్ మిల్లులను అందుబాటులో ఉంచుతుంది. ప్రధానంగా లెవల్-1 (ఎల్1)జిన్నింగ్ మిల్లులను స్లాట్ బుకింగ్ కోసం అమల్లోకి తెస్తుంది. ఉదాహరణకు..ఎల్-1లో ఉన్న ఓ జిన్నింగ్ కెపాసిటీ 3వేల క్వింటాళ్ల వరకు నిల్వ సామర్థ్యం ఉందనుకుంటే.. స్లాట్ బుకింగ్ చేసుకున్నప్పుడు ఎల్-1 మిల్లులో విక్రయించేలా రైతుకు ముందస్తుగా తేదీ, సమయం ఇస్తుంది. ఆ మిల్లు కెపాసిటీ పూర్తయిన తర్వాత దాని పేరు కనిపించదు. ఎల్-1లోనే ఉన్న మిగతా మిల్లుల పేర్లు మాత్రం కనిపిస్తాయి. ఈ విధంగా స్లాట్ బుకింగ్ ప్రక్రియ సాగుతుంది.



కపాస్ కిసాన్ యాప్, స్లాట్ బుకింగ్‌కు సంబంధించిన పోస్టర్

రేపు సన్నాహక సమావేశం..

పత్తి కొనుగోళ్ల ప్రక్రియపై జిల్లా యంత్రాంగంతో కలెక్టర్ రాజర్షిషా గురువారం సమావేశం కానున్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు మొదలు కానుంది. వ్యవసాయ, మార్కెటింగ్, సీసీఐ, అఖిలపక్ష రైతు సంఘాల నాయకులు, వివిధ శాఖల అధికారులు హాజరై కొనుగోళ్ల ప్రారంభానికి సంబంధించి చర్చించనున్నారు.

కపాస్ కిసాన్ యాప్ ద్వారా..

జిల్లాలో పత్తి కొనుగోళ్ల ప్రక్రియ త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. కాగా ఈ సీజన్‌లో కపాస్ కిసాన్ యాప్‌ను సీసీఐ అమలుపరుస్తుంది. దీనిద్వారా స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకొచ్చింది. రైతులు ప్రభుత్వ కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) కింద సీసీఐకి పత్తి అమ్మడానికి స్లాట్ బుకింగ్ తప్పనిసరి. ఈ ప్రక్రియ తర్వాతే మార్కెట్లో జిన్నింగ్ మిల్లు కేటాయిస్తుంది. ఆ మిల్లులోనే రైతు పత్తిని విక్రయించాల్సి ఉంటుంది. మొత్తంగా మొదటిసారి ప్రవేశపెడుతున్న ఈ ప్రక్రియ సక్సెస్ అవుతుందా.. లేదా అనేది చూడాల్సిందే.

రైతుకు ఏ మిల్లులోనైనా విక్రయించుకునే స్వేచ్ఛ

జిల్లాలో సీసీఐ కేంద్రాల పరిధిలోని జిన్నింగ్ మిల్లుల జాబితా యాప్‌లో అందుబాటులో ఉంటుంది. ఇందులో రైతులు తమకు అనువైన మిల్లును ఎంచుకోవచ్చు. కేటాయించిన తేదీన అక్కడికి వెళ్లి పంట దిగుబడిని విక్రయించుకోవచ్చు.అయితే జిల్లా రైతులు జిల్లాలోని సీసీఐ కేంద్రాల్లోనే పత్తిని విక్రయించుకోవచ్చా.. లేనిపక్షంలో ఉమ్మడి జిల్లాలో ఎక్కడైనా స్లాట్ బుకింగ్ ద్వారా విక్రయించవచ్చా అనే విషయంలో అధికారులు స్పష్టతనివ్వడం లేదు. ప్రస్తుతానికైతే జిల్లాలో ఏదైన కేంద్రంలో స్లాట్ బుక్ చేసుకొని విక్రయించవచ్చని చెబుతున్నారు.

స్లాట్ బుకింగ్ అమలు చేస్తున్నాం

స్లాట్ బుకింగ్ విధానాన్ని ఈ సీజన్ నుంచి అమలు చేస్తున్నాం. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్ ఆదేశాల మేరకు ఇటీవల ఏఈవోలకు శిక్షణ ఇచ్చాం. ప్రధానంగా వారు క్షేత్రస్థాయిలో రైతులకు ఈ యాప్‌పై అవగాహన కల్పిస్తారు. అంతే కాకుండా రైతులకు స్లాట్ బుకింగ్ విధానంలో సహాయపడతారు.

– గజానన్, జిల్లా మార్కెటింగ్ అధికారి

రైతులకు ఉపయుక్తంగా యాప్

పత్తి కొనుగోళ్ల విషయంలో స్లాట్ బుకింగ్ విధానం రైతులకే కాకుండా కౌలు రైతులకు కూడా ఉపయుక్తంగా ఉంటుంది. ఏఈవోలు వారికి సహాయపడతారు. భూయజమాని, కౌలు రైతుల వివరాలు నమోదు చేస్తారు. పంట దిగుబడిని సీసీఐకి మద్దతు ధరకు అమ్ముకునేందుకు వీలు కల్పిస్తారు.

– శ్రీధర్‌స్వామి, జిల్లా వ్యవసాయ అధికారి


కదులుతున్న డొంక

- భూకబ్జాలో పలు శాఖల అధికారుల పాత్ర!
- వారి సహకారంతోనే రియల్టర్ల దందా
- సర్వేయర్‌పై ఇప్పటికే కేసు
- 'రెవెన్యూ' పాత్రపైనా దర్యాప్తు

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలో వెలుగుచూసిన భూకబ్జా వ్యవహారంలో రియల్టర్లతో అంటకాగిన అవినీతి అధికారుల బండారం బట్టబయలవుతోంది. బ్యాంకు తనఖాలో ఉన్న రూ.కోట్ల విలువైన భూమిని కాజేసిన బడా రియల్టర్లతో ఇప్పటికే ఊచలు లెక్కపెట్టిస్తున్న పోలీసులు వారికి సహకరించిన అధికారులపైనా చర్యలకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం పొరుగు జిల్లాలో పనిచేస్తున్న మండల సర్వేయర్ శివాజీపైన కేసు నమోదు చేసిన పోలీసులు, భూమాఫియాతో చేతులు కలిపిన రెవెన్యూ, సర్వే ల్యాండ్స్ రికార్డ్స్ అధికారుల పాత్రపైనా లోతైన విచారణ జరుపుతున్నారు. వారిపైన కేసుల నమోదుకు సిద్ధమవుతున్నారు. దీంతో అక్రమార్కుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

అక్రమంగా సప్లిమెంటరీ సేత్వార్..

ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్ శివారు రణదీవేనగర్‌లో గల సర్వేనంబర్ 65/బిలో 1.05 ఎకరాలు, 64/4లో గల 1.04 ఎకరాలు కలిపి 2.09 ఎకరాల భూమి ఆర్థిక నేరాల కేసులో ఈడీ ఆధీనంలో ఉంది. రూ.కోట్ల విలువైన భూమి కావడంతో బడా రియల్టర్లు దానిపై కన్నేశారు. రెవెన్యూ అధి కారుల అండతో తప్పుడు పత్రాలు సృష్టించారు. దొడ్డిదారిన ఆదిలాబాద్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో 2023 ఆగస్టు 17న రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. సర్వేల్యాండ్ రికార్డ్స్‌లోనూ ఈ భూమి తమ పేరిటనే ఉందని తెలిపేలా పన్నాగం పన్నారు. 2024 నవంబర్‌లో అక్రమంగా సప్లిమెంటరీ సేత్వార్‌ను చేసుకున్నారు. దీనికి సర్వేల్యాండ్ రికార్డ్స్ ఏడీ కూడా ఆమోదం తెలిపినట్లుగా పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారంలో నాటి ఆదిలాబాద్ అర్బన్ మండల సర్వేయర్‌గా పనిచేసిన శివాజీ కీలకపాత్ర పోషించినట్లు పోలీసులు నిర్ధారించారు. ఆయనపై కేసు నమోదు చేశారు. విషయాన్ని ముందుగానే పసిగట్టిన సదరు అవినీతి అధికారి ప్రస్తుతం పరారీలో ఉన్నట్లుగా పోలీసులు చెబుతున్నారు. అయితే అక్రమంగా చేసిన సేత్వార్, రిజిస్ట్రేషన్‌పై కలెక్టర్ రాజర్షి షాకు ఫిర్యాదు అందడంతో ఆ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని అధికారులను ఆదేశించారు.



అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కలెక్టర్ రాజర్షి షా జారీ చేసిన ఉత్తర్వు ప్రతి

అధికారుల పాత్రపై విచారణ..

ఈ మొత్తం వ్యవహారంలో పరారీలో ఉన్న మండల సర్వేయర్ ప్రధాన పాత్ర పోషించినట్లుగా స్పష్టమవుతుంది. ఇదే కాకుండా సర్వేయర్‌గా పనిచేసిన సమయంలో మావలలో ప్రతీ వెంచర్‌లోనూ ప్రభుత్వ, అసైన్డ్ ల్యాండ్స్‌ను రియల్టర్లు ఆక్రమించేలా సదరు అధికారి తనవంతు సహకారం అందించినట్లుగా తెలుస్తోంది. ఆయనతో పాటు అప్పటి రెవెన్యూ అధికారులు సైతం భూకబ్జాలు వారికి తెలిసినా చూసీచూడనట్లుగా వ్యవహరించారని సమాచారం. ఇందుకు వారికి పెద్ద మొత్తంలోనే లబ్ధి చేకూరినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆ అధికారుల బాగోతంపైనా పోలీసులు సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు ఈ వ్యవహారంలో భాగస్వాములైన రెవెన్యూ, సర్వే ల్యాండ్ రికార్డు అధికారులెవరనే దానిపైనా కలెక్టర్ రాజర్షి షా సైతం ఆరా తీస్తున్నారు. దీంతో బాధ్యులపై శాఖాపరంగానూ వేటు పడే అవకాశమున్నట్లుగా తెలుస్తోంది.

బాధ్యులపై చర్యలు తప్పవు

ఈడీ ఆధీనంలోని భూమిని కబ్జా చేసిన రియల్ వ్యాపారులను ఇప్పటికే అరెస్ట్ చేసి జైలుకు పంపించాం. ఈ అక్రమదందాలో వ్యాపారులకు సహకరించిన మండల సర్వేయర్ శివాజీపై కేసు నమోదు చేశాం. ఆయనతో పాటు రియల్టర్లకు సహకరించి తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసిన అధికారుల పాత్రపైనా విచారణ జరుపుతున్నాం. బాధ్యులైన ఏ ఒక్కరినీ వదిలిపెట్టం. అక్రమార్కులందరిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తాం.

– ఎల్.జీవన్‌రెడ్డి, డీఎస్పీ, ఆదిలాబాద్

బాధితులకు సత్వర న్యాయం అందాలి

- కలెక్టర్ రాజర్షి షా
- జిల్లా అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లోని బాధితులకు సత్వర న్యాయం అందించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. జిల్లా అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సమావేశాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. ఎస్పీ అఖిల్ మహాజన్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి జిల్లాలో అట్రాసిటీ కేసుల నమోదు, వాటి పురోగతి, బాధితులకు నష్ట పరిహారం చెల్లింపు, పెండింగ్ కేసులు వంటి అంశాలపై పోలీస్‌స్టేషన్లు, మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పుర్వాపరాలు పరిశీలించి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలన్నారు. అలాగే బాధితులకు పరిహారం జమచేసేందుకు అవసరమైన బ్యాంకు ఖాతాలు సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, సబ్‌కలెక్టర్ యువరాజ్, అదనపు ఎస్పీ కాజల్ సింగ్, ట్రెయినీ కలెక్టర్ సలోని, డీఎస్సీడీవో సునీత కుమారి, ఆర్డీవో స్రవంతి, కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సన్మానం..

నీతి ఆయోగ్ యాజ్ కేసు ఛాలెంజ్‌లో నాలుగు జాతీయ స్థాయి పురస్కారాలు అందుకున్న కలెక్టర్ రాజర్షి షాను జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. సమావేశం అనంతరం ఆయనను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఇందులో సభ్యులు ఆరెల్లి మల్లేశ్, మేస్రం జంగుబాపు, బాల శంకర్‌కృష్ణ, పంద్రం శ్యామల, తోట విజయ్, ఉషారాణి, లక్ష్మీకాంత్ తదితరులున్నారు.

విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా చర్యలు

కైలాస్‌నగర్: జిల్లాలో బెస్ట్ అవేలబుల్ స్కూల్ విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ రాజార్షిషా అన్నారు. బీఏఎస్ విద్యార్థులను ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు బడుల్లోకి రానివ్వకపోవడంతో సోమవారం జిల్లా వ్యాప్తంగా తల్లిదండ్రులతో కలిసి వారు ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏడు ప్రైవేట్ పాఠశాలల్లో 425 మంది విద్యార్థులు ఈ పథకం కింద చదువుతున్నారని అన్నారు. బుధవారం ఆయా యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి అధికారి సునీత కుమారి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి నిహారిక పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి

- ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ మధుసూదన్



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ మధుసూదన్

కైలాస్‌నగర్: వినియోగదారులకు నిరంతర నాణ్యమైన విద్యుత్ అందించాలని ఎన్పీడీసీఎల్ ఆపరేషన్ డైరెక్టర్ టి.మధుసూదన్ అన్నారు. స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో విద్యుత్‌శాఖ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలో విద్యుత్ డిమాండ్, సరఫరా, ఇబ్బందులపై మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 33కేవీ 11కేవీ లైన్స్‌లో పెట్రోలింగ్ నిర్వహించి సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చూడాలన్నారు. అన్ని సర్వీసులను ట్రాన్స్‌ఫార్మర్ల మీద మ్యాపింగ్ చేయాలన్నారు. ప్రమాదకరంగా ఉన్న, వంగిపోయిన విద్యుత్ స్తంభాలు, వదులుగా ఉన్న లైన్స్‌ను గుర్తించి వెంటనే సరి చేయాలన్నారు. రోజువారీగా ఆ డేటాను యాప్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతీ సెక్షన్ ఆఫీసర్ వారానికి ఒక గ్రామంలో పొలం బాట కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న అగ్రికల్చర్ సర్వీసులను వెంటనే రిలీజ్ చేయాలన్నారు. సమావేశంలో ఆపరేషన్ సీఈ అశోక్, సీఈ కన్‌స్ట్రక్షన్ జే.ఆర్.చౌహాన్, సర్కిల్ పరిధిలోని డివిజనల్ ఇంజినీర్స్, అకౌంట్స్ ఆఫీసర్స్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్స్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్స్, అసిస్టెంట్ ఇంజినీర్స్, సబ్ ఇంజినీర్స్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో వసతులపై సర్వే

- అందుబాటులోకి జీపీ మానిటరింగ్ యాప్
- వివరాల సేకరణలో కార్యదర్శులు నిమగ్నం
- పంచాయతీ అభివృద్ధికి దోహదపడే అవకాశం

నేరడిగొండ: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ఫోకస్ పెంచింది. ప్రతీ పంచాయతీలో మౌలిక వసతులు, ప్రభుత్వ ఆస్తుల స్థితిగతులు గుర్తించేందుకు గాను గత నెల 18 నుంచి సర్వేకు శ్రీకారం చుట్టింది. ప్రత్యేకంగా జీపీ మానిటరింగ్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ మేరకు కార్యదర్శులు ఆయా జీపీల్లో మౌలిక వసతుల వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు. జిల్లాలో మొత్తం 473 గ్రామ పంచాయతీలు ఉండగా, అన్ని చోట్ల సర్వే చేపడుతున్నారు. కొద్ది నెలలుగా పంచాయతీ పాలకవర్గాలు లేకపోవడం, అలాగే నిధుల కొరతతో పలు గ్రామాల్లో సమస్యలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో సర్వే ద్వారా గ్రామాల్లో ఉన్న వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం అంచనా వేయనుంది. తద్వారా పల్లె అభివృద్ధికి దోహదపడనుంది.



వడూర్ అంగన్‌వాడీ కేంద్రం సమాచారం సేకరిస్తున్న పంచాయతీ కార్యదర్శి

సమగ్ర సమాచారం సేకరణ..

ఈ సర్వే ద్వారా గ్రామాల్లో మొత్తం 21 అంశాలపై వివరాలు సేకరించనున్నారు. జీపీ మానిటరింగ్ యాప్ ద్వారా ప్రతీ కార్యదర్శి క్షేత్ర స్థాయిలో డేటా నమోదు చేయాలి. పంచాయతీ భవనం, అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాల, ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్, సెగ్రిగేషన్ షెడ్, నర్సరీ, వైకుంఠదామం, తాగునీరు, వీధిదీపాలు వంటి ప్రాథమిక వసతులు ఉన్నాయా లేదా పరిశీలించి వివరాలు నమోదు చేయాలి. దీంతో వసతుల స్థాయి, ప్రజా అవసరాల స్థితి, భవిష్యత్ ప్రాధాన్యతలు స్పష్టంగా తెలుస్తాయని అధికారులు చెబుతున్నారు.

అభివృద్ధికి పునాది..

గ్రామాల్లోని ప్రభుత్వ ఆస్తుల వాస్తవ స్థితి, అభివృద్ధి అవకాశాలు, ప్రజా వసతుల లోపాలపై ఈ సర్వే ద్వారా సమగ్ర అవగాహన లభిస్తుంది. తద్వారా రాబోయే అభివృద్ధి ప్రణాళికల్లో దీనికి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తోంది.

21 అంశాలపై పరిశీలన..

గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ ఆస్తులు, మౌలిక వసతులపై సర్వే చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలోని ఆయా పంచాయతీల కార్యదర్శులకు సర్వే తీరుతెన్నులను వివరించాం. 21 అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వివరాలను జీపీ మానిటరింగ్ యాప్‌లో పారదర్శకంగా నమోదు చేయాలని ఆదేశించాం.

– రమేశ్, జిల్లా పంచాయతీ అధికారి

అనైక్యతతోనే పార్టీ ఓటమి

- ఏకాభిప్రాయంతోనే డీసీసీ అధ్యక్షుడి నియామకం
- ఏఐసీసీ పరిశీలకుడు అజయ్ సింగ్



మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకుడు అజయ్‌సింగ్

కైలాస్‌నగర్: కాంగ్రెస్‌కు ప్రజల్లో ఎప్పుడూ ఆదరణ ఉంటుందని, అయితే నాయకుల్లో అనైక్యతే పార్టీ ఓటమికి కారణమవుతుందని ఏఐసీసీ పరిశీలకులు అజయ్ సింగ్ అన్నారు. పట్టణ శివారులోని గాయత్రి గార్డెన్‌లో జిల్లా అధ్యక్షుడి నియామక ప్రక్రియపై మంగళవారం అభిప్రాయ సేకరణ నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లాలోని ముఖ్య నేతలతో పాటు నియోజకవర్గ, మండల నాయకులు హాజరయ్యారు. వారందరి నుంచి వ్యక్తిగతంగా, లిఖితపూర్వకంగా అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదలకు చేరువైందన్నారు. వారి మద్దతుతో రానున్న స్థానిక సంస్థల్లో పార్టీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరి నుంచి అభిప్రాయాలు సేకరించి అందరి ఆమోదం మేరకే జిల్లా అధ్యక్షుడిని నియమిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, సంఘటన్ శ్రుజన్ అభియాన్ సమన్వయ కర్త గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సీహెచ్ రాంభూపాల్, సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు జితేందర్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, మాజీ ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, ఏఐసీసీ మెంబర్ నరేశ్‌జాదవ్, ఆదిలాబాద్, బోథ్ అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు కంది శ్రీనివాస రెడ్డి, ఆడె గజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మాలలను అణచివేసేందుకు కుట్ర

- వర్గీకరణకు వ్యతిరేకంగా శాంతియుత పోరాటం
- మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు ఆర్‌ఎస్ రత్నాకర్



మాట్లాడుతున్న రత్నాకర్

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణలోని రాజకీయ పార్టీలు మాలలను అణచివేసేందుకు కుట్రలు పన్నుతున్నాయని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌ఎస్ రత్నాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాలల సామాజిక వర్గాన్ని కొందరు టార్గెట్ చేసినప్పటికీ మాల నాయకులు, ప్రజాప్రతినిధులు నోరు మెదపడం లేదన్నారు. తెలంగాణలో పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ వర్గీకరణ విషయంలో మాట్లాడలేదని, అధికారంలో వచ్చిన తర్వాత రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ చేపట్టారని అన్నారు. హస్తం పార్టీ ఎస్సీ వర్గీకరణకు బీజం వేస్తే, ప్రధాని మోదీ దేశ వ్యాప్తంగా వర్గీకరణ చేపట్టారని తెలిపారు. అయితే తాము మాదిగ సోదరులకు వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. ప్రస్తుతం మాలల పరిస్థితి మాత్రం దయనీయంగా ఉందన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా శాంతియుత పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు చెప్పిన విధంగా సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ చేపట్టారని తెలిపారు. వర్గీకరణతో వందలో నలుగురికి ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. దేశ వ్యాప్తంగా ఎస్సీ జాబితాలో 1108 కులాలు ఉన్నాయని, వారందరికీ ఏవిధంగా ఫలాలు పంచుతారని ప్రశ్నించారు. ఆయన వెంట మాల మహానాడు నాయకులు బల్లెం లక్ష్మణ్, ప్రభాకర్‌రావు, బాలచారి, తదితరులున్నారు.

క్లుప్తంగా

బాలికపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తి రిమాండ్

బజార్‌హత్నూర్: బాలికపై లైంగికదాడికి పాల్పడిన ఒకరిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. నేరడిగొండ మండలం తేజాపూర్ గ్రామానికి చెందిన చందనగిరి కిష్టయ్య (50) సోమవారం బజార్‌హత్నూర్ గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. రోడ్డుపై ఆడుకుంటున్న బాలిక (9)పై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సంజయ్‌కుమార్ తెలిపారు.

ఆటో డ్రైవర్‌కు ఏడాది జైలు

ఆదిలాబాద్‌టౌన్: మద్యం మత్తులో ఆటో నడిపి ఒకరి మృతికి కారణమైన ఆటో డ్రైవర్‌కు ఏడాది జైలుశిక్షతో పాటు రూ.7,500 జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి కె.ప్రభాకరరావు మంగళవారం తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి ఎం.గంగాసింగ్ తెలిపారు. జైనథ్ మండలానికి చెందిన జక్కులవార్ రికేష్ 2024 ఏప్రిల్ 6న ఆదిలాబాద్ నుంచి జైనథ్ వైపు మద్యం మత్తులో ఆటోలో వెళ్తుండగా తర్నం బ్రిడ్జి సమీపంలో ఆటో బోల్తా పడింది. అదే మండలానికి చెందిన ఇప్ప భరత్ కుమార్ అక్కడికక్కడే మృతిచెందగా, మిగితా ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. జైనథ్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా అప్పటి సీఐ డి.సాయినాథ్ దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు డ్యూటీ అధికారి ఎంఏ జమీర్ 18 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పీపీ రహీమ్ నేరం రుజువు చేయడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చినట్లు వివరించారు.

ఐదుగురు గంజాయి విక్రేతల అరెస్ట్

భీమారం: గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ తెలిపారు. మంగళవారం పోలీస్‌స్టేషన్ వివరాలు వెల్లడించారు. తమకు అందిన సమాచారం మేరకు భీమారం మండల కేంద్రంలోని గోపు రాజయ్య బిల్డింగ్ వద్ద గంజాయి విక్రయిస్తున్న దుర్గం సంజయ్ (తాళ్లగూడెం, భీమారం), సెగ్యం విజయ్‌కుమార్ (సుంకరిపల్లి, భీమారం), పోలవేని రాజేందర్ (కొత్తగుడిసెలు, భీమారం), కుక్కల అరవింద్ (కక్కెరగుంట, రామడుగు), అనెమోలు శేఖర్ (కక్కెరగుంట, రామడుగు) పట్టుకుని వారి వద్ద నుంచి 350 గ్రాముల గంజాయి, కారు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సై శ్వేత, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో నాగుపాము కలకలం



పామును బంధిస్తున్న స్నేక్‌క్యాచర్ అనిల్

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని వెంకటపూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం నాగుపాము కనిపించడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. మధ్యాహ్నం ఇంటర్వెల్ సమయంలో మూత్రశాలల సమీపంలో నాగుపామును గమనించిన విద్యార్థులు వెంటనే ఉపాధ్యాయులతో చెప్పారు. ప్రధానోపాధ్యాయురాలు సుహాసిని శాంతినగర్ కాలనీకి చెందిన స్నేక్‌క్యాచర్ గిరిగంటి అనిల్‌కు సమాచారం అందించడంతో చాకచక్యంగా పామును బంధించి అటవీప్రాంతంలో వదిలిపెట్టాడు. ఈ సందర్భంగా స్నేక్‌క్యాచర్ అనిల్‌ను అభినందించారు.

ఆత్మీయం.. ఆదివాసీ వైభవం



దండేపల్లి మండలం గుడిరేవులోని ఏత్మాసార్ పేన్ పద్మల్‌పురి కాకో ఆలయం

ఆదివాసీ గూడేల్లో అంగరంగ వైభవంగా సాగే దండారీ సంబరం మొదలైంది. డప్పుల దరువులు, గజ్జెల మోతలు, గుస్సాడీ నృత్యాలతో అడవితల్లి మురిసి పోనుంది. ఆదివాసీల ఆరాధ్య దేవత 'ఏత్మాసార్ పేన్' పేరిట చేసే ప్రత్యేక పూజలతో దండారీ పండుగ ప్రారంభమైంది. దీపావళికి ముందు అశ్వయుజ పౌర్ణమి మరుసటి రోజు భోగితో ప్రారంభమై కొలబొడితో ముగియనుంది. పక్షం రోజుల పాటు కొనసాగే ఉత్సవాలకు గూడేలన్నీ సిద్ధమవుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం దండారీని ప్రత్యేక పండుగగా గుర్తించింది.
– బజార్‌హత్నూర్



గుస్సాడీ టోపీ తయారు చేస్తున్న గిరిజనుడు



దండేపల్లి మండలం గుడిరేవులోని ఏత్మాసూర్ పద్మల్‌పురి కాకో అమ్మవారు

- గూడేల్లో మొదలైన దండారీ సందడి
- ఆరాధ్య దైవానికి ప్రత్యేక పూజలు
- అడవి బిడ్డల గుండెల్లో ఆనందోత్సాహాలు...

గుస్సాడీలు అశ్వయుజ పౌర్ణమి మరుసటి రోజు భోగితో మాలధారణ చేసి పది రోజుల పాటు కఠిన దీక్ష చేపడతారు. దీక్ష పూర్తయ్యే వరకు స్నానం ఆచరించరు. ఒంటిపై చుక్క నీరుకూడా పడకుండా.. కాళ్లకు చెప్పులు ధరించకుండా.. ఒంటిపై ఎలాంటి వస్త్రాన్ని కప్పుకోకుండా అర్ధనగ్నంగానే గడుపుతారు. నేలపైనే కూర్చోవడం, నేలపైనే పడుకోవడం వారి ఆచారం. గుస్సాడీల్లో పోరీలది మరింత ప్రాముఖ్యత. స్త్రీ వేషధారణలో ఉండే యువకులను ఆదివాసీలు పోరీలు అని పిలుస్తారు. వారు ఏ ఊరికి వెళ్లినా.. ఏ ఇంటిని సందర్శించినా మహిళలు మంగళహారతులు ఇచ్చి కాళ్లకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకుంటారు.

ఆరాధ్యదైవం ఏత్మాసార్ పద్మల్‌పురి కాకో

ఆదివాసీలకు పెద్ద పండుగ దీపావళి.. ఇందులో భాగంగానే గోండులకు ఆరాధ్యదైవమైన ఏత్మాసార్ పద్మల్‌పురి కాకో ఆలయానికి భక్తజన దండు కదులుతుంది. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని గుడిరేవు గోదావరి తీరంలో కొలువై ఉన్న పద్మల్ పురి కాకో ఆలయానికి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా ప్రాంతాల నుంచి ఆదివాసీలు అధికసంఖ్యలో తరలివస్తారు. గోదావరినదిలో పుణ్యస్నానం ఆచరిస్తారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కలు తీర్చుకుంటారు.

గుస్సాడీ టోపీ ప్రత్యేకం

గుస్సాడీ టోపీలను నిపుణులైన గోండులు, కొలాంలు తయారు చేస్తారు. నెమలి ఈకలను సేకరించి వాటి తెల్లని కాడలను అల్లికగా మెలివేసి తలకు పట్టే ఒక చిన్న వెదురు బుట్ట అంచు చుట్టూ గట్టిగా కుట్టేసి, నెమలి పింఛాలు పై వైపు అందంగా బయటకు గుండ్రని బుట్టలాగా విస్తరిస్తూ, కదిలినప్పుడు విలాసంగా ఊగేలా ఏర్పాటు చేస్తారు. టోపీకి చుట్టూ ముఖ్యంగా ముందు వైపు, పలు వరుసల్లో, పెద్ద అద్దాలతో, రంగురంగుల జరీ దారాలు, చక్కటి డిజైన్లు ఉన్న గుడ్డపట్టీలతో, పలు ఆకారాల రంగురంగుల చెమ్కీ బిళ్లలు, చిన్ని గంటల మాలలతో, కొన్నిసార్లు రెండు వైపులా జింక కొమ్ములతోనూ అలంకరిస్తారు.



వాయిద్యాలను సిద్ధం చేస్తున్న ఆదివాసీ గిరిజనుడు

నువ్వుల నూనెతో పూజలు



నువ్వుల నూనె తయారు చేస్తున్న ఆదివాసీలు

గిరిజన గ్రామాల్లోని ప్రతీ ఇంట్లో దీపావళి సందర్భంగా మహిళలు ఉపవాస దీక్ష చేస్తారు. నువ్వులను రోలులో వేసి దంచి నూనె తీస్తారు. ఆ నూనెతో దండారీ ఉత్సవాలు ముగిసే వరకు దీపాలు వెలిగించి పూజలు చేస్తారు.



గుస్సాడీ వేషధారణలో డెంసా నృత్యం చేస్తున్న ఆదివాసీలు (ఫైల్)

ఆదివాసీల మధ్య ఆత్మీయ బంధం

దండారీ అంటేనే ఐకమత్యానికి నిదర్శనం. ఈ పండుగ వేళ ఆదివాసీ గ్రామాల గిరిజనం ఒక ఊరి నుంచి మరో ఊరికి విడిది వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. రాత్రంతా నృత్యం చేస్తూ రేలారె రేలా పాటలతో పాటు గోండి హాస్యపు నాటికలు ప్రదర్శించి వినోదాన్ని అందిస్తారు. తెల్లవారుజామునే కాలకృత్యాలు తీర్చుకుని మాన్‌కోలాతో నృత్య ప్రదర్శనలు చేసి సాయంత్రం సార్‌కోలాతో ముగిస్తారు. ఈ సందర్భంగా ఆదివాసీలు అతిథులకు ప్రత్యేక విందు ఏర్పాటు చేసి వీడ్కోలు పలుకుతారు. అలా చేయడం ద్వారా రెండు గ్రామాల మధ్య సత్సంబంధాలు, బాంధవ్యాలు పెరుగుతాయని ఆదివాసీ పటేళ్లు పేర్కొంటున్నారు.

నాలుగు సగల పేరిట ఉత్సవాలు

దండారీ పండుగలో ఏత్మాసార్ పేన్ పేరిట గిరిజనులు నాలుగు సగ(గోత్రం)లలో ఉత్సవాలు జరుపుకుంటారు. నాలుగు సగల అంటే గుమ్మేల, ఐదు సగల వారు అంటే ఫర్ర, ఆరు సగల వారు అంటే కోడల్, ఏడు సగల వారు అంటే తపల్ పేరిట ఈ ఉత్సవాలు కొనసాగుతాయి. వేడుకల్లో భేటికోలా, మాన్‌కోలా, సదర్‌కోలా, కోడల్‌కోలా, సార్‌కోలా, కలివల్‌కోలా నృత్యాలు చేయడం ఆదివాసీలకే సొంతం. పేర్లు ఎంత వైవిధ్యంగా ఉన్నాయో వారి ఆటపాటలు కూడా అంతే వైవిధ్యంగా సాగుతాయి. చచోయ్ ఇట్ కోలారా.. దేనే దేనారా.. రేలా.. రేలా.. లాంటి ఆట పాటల నడుమ ఉత్సవాలు అట్టహాసంగా కొనసాగుతాయి.

కొలబొడితో ముగింపు

దీపావళి రెండు రోజుల తరువాత గురువారం కొలబొడితో ఈ దండారీ వేడుకలు ముగుస్తాయి. ఈ సందర్భంగా దండారీ బృందం ఇంటింటికీ వెళ్లగా గృహిణి ఓ పల్లెంలో ధాన్యాలు, తోచినంత నగదు ఉంచిన హారతిని వారికి అందిస్తుంది. దానిని వారు సంతోషంగా స్వీకరించి ఇంట్లో అందరూ బాగుండాలని, పాడిపంటలు సమృద్ధిగా పెంపొందాలని ఆశీర్వదిస్తారు. అనంతరం పాటలు పాడుతూ హారతి పూజ ఇస్తారు. అనంతరం గ్రామ పొలిమేరలో ఉన్న ఇప్పచెట్టు వద్ద తమ ఇలవేల్పు అయిన భీందేవుని సన్నిధికి చేరుకుంటారు. తలకు ధరించిన నెమలి టోపీలను తొలగిస్తారు. గుస్సాడీ వేషధారణ, అలంకరణ వస్తువులను భీందేవుని సన్నిధిలో పెట్టి కోళ్ళు, మేకలను బలి ఇస్తారు. భీం దేవునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం విందు భోజనాలతో కొలబొడి నిర్వహించి కార్యక్రమాన్ని ముగిస్తారు.



రేలా రె రేలా పాటలకు నృత్యం చేస్తున్న ఆదివాసీ మహిళలు (ఫైల్)

భోగి పూజలు



భోగి పూజలు చేస్తున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి: మండలంలోని పిప్రి లక్కుగూడ, తుమ్మగూడ గ్రామాల్లో మంగళవారం భోగి పూజలు నిర్వహించి దండారీ ఉత్సవాలు ప్రారంభించారు. ఏత్మసార్ దేవతకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

పవిత్రమైన పండుగ



మా ఆదివాసీ గోండు గిరిజనులకు దీపావళి పవిత్రమైన పండుగ. ఇంటిల్లిపాది ఆనందంగా జరుపుకుంటాం. గిరిజన దేవతలను, వన దేవతలను పూజిస్తాం. బంధువుల ఇళ్లకు వెళ్తాం. గుస్సాడీల థింసా నృత్యం, ఆడపడుచుల రేలారేరేలా నృత్యం ఆకట్టుకుంటాయి.
– కొడప భీంరావ్ పటేల్, చింతలసాంగ్వీ

ఘనంగా జరుపుకుంటాం



దీపావళికి పక్షం రోజుల ముందే అన్నీ సిద్ధం చేసుకుంటాం. ఎంత పేద గిరిజనుడైనా ఈ పండుగకు ఇంటిని శుభ్రపరచడం, కొత్త బట్టలు కొనుక్కోవడం, పిండివంటలకు సామగ్రి సమకూర్చుకుంటారు. నెమలి ఈకలతో టోపీలు తయారు చేసుకుంటాం. దండారీ ఘనంగా జరుపుకుంటాం.
– కనక లంకు మహాజన్, తుమ్మగూడ, ఇంద్రవెల్లి

ప్రోత్సాహం అందించాలి



ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు కాపాడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం గత సంవత్సరం రూ.15 వేలు అందించింది. ఈ సంవత్సరం కూడా ప్రోత్సాహకం అందించాలని జిల్లా సార్‌మేడీలు, కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాను కలిసి విన్నవించాం.
– మేస్రం దుర్గు, జిల్లా సార్‌మేడి, ఉట్నూర్

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య



కల్పన (ఫైల్)

తిర్యాణి: కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని కన్నాల గ్రామానికి చెందిన కల్పన (28)కు తిర్యాణి మండలంలోని గంభీరావుపేటకు చెందిన సైదం శేఖర్‌తో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. రెండేళ్లుగా దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండడంతో కల్పన పుట్టింటికి వెళ్లిపోయింది. పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించడంతో ఇటీవల మళ్లీ అత్తారింటికి వచ్చింది. సోమవారం మళ్లీ గొడవ జరగడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. తన కుమార్తె మృతికి అల్లుడే కారణమని మృతురాలి తల్లి దేవక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో ఒకరు..

దండేపల్లి: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై తహసీనొద్దీన్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని గుడిరేవు గ్రామానికి చెందిన పూసాల రాజు (36) ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోవడంతో ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. తరచూ భార్య రాజేశ్వరితో గొడవపడటంతో రెండు రోజుల క్రితం ఇద్దరు పిల్లలతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన రాజు ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం చిట్టీడబ్బుల కోసం వెళ్లిన వ్యక్తి చూడగా ఉరేసుకుని కనిపించాడు. మృతుని తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



పంచనామా నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్

దాడి కేసులో నలుగురి రిమాండ్

జైపూర్: మండలంలోని వేలాలలో జరిగిన దాడి కేసులో నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ తెలిపారు. గ్రామంలో ప్యాగ రాజ సమ్మయ్య, అతని సోదరులకు 33 గుంటల భూమి ఉంది. ఆ భూమి విషయంలో అన్న మైసయ్య, అతని కుమారులు సమ్మయ్య, నగేష్, మల్లేశ్‌తో కొద్దిరోజులుగా గొడవలు జరుగుతున్నాయి. అందులో ఇటీవల మైసయ్య ఇల్లు నిర్మాణం చేపట్టగా రాజ సమ్మయ్య కుమారులు శ్రీనివాస్, సంతోష్, భార్య మల్లక్క భూమి వద్దకు వెళ్లి భూమిని పంచుకున్న తర్వాత ఇల్లు కట్టుకొమ్మన్నారు. ఈ విషయంలో సమ్మయ్య, నగేష్, మల్లేశ్, లక్ష్మి వారిపై దాడికి పాల్పడ్డారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వేణుచందర్

అద్దె కారు తిరిగివ్వని ఇద్దరు..



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సునీల్ కుమార్

ఆదిలాబాద్‌టౌన్: కారు అద్దెకు తీసుకొని తిరిగి ఇవ్వని ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. మంగళవారం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. 2025 మార్చి 28న సునార్ గల్లికి చెందిన అన్నదమ్ములు ముమ్మడివార్ రాకేష్, ముమ్మడివార్ కృష్ణ హైదరాబాద్‌కు వెళ్తామని చెప్పి రవీంద్రనగర్‌కు చెందిన బొద్దం రాజేశ్ వద్ద కారు అద్దెకు తీసుకున్నారు. ఇప్పటి వరకూ తిరిగి ఇవ్వకపోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

33వ రోజుకు కార్మికుల సమ్మె

ఉట్నూర్‌రూరల్: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ఐటీడీఏ కార్యాలయం ఎదుట కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె 33వ రోజుకు చేరుకుంది. మంగళవారం గిరిజన సంఘాలు, వివిధ పార్టీల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు మాట్లాడుతూ సమ్మె చేపట్టి 33 రోజులు కావస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మద్దతు తెలిపిన వారిలో కొలాం సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొడప సోనేరావు, కుంర రాజు, భీంరావు, సంజయ్, విజయ్, బీఆర్‌ఎస్ నాయకులు కొమ్ము విజయ్, కాటం రమేశ్, ధరణి రాజేశ్, బాజీరావు, దావుల రమేశ్ ఉన్నారు.



మాట్లాడుతున్న జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు

బాసర ఆలయ హుండీ లెక్కింపు

బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయ హుండీని మంగళవారం లెక్కించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి అంజనాదేవి తెలిపారు. 83 రోజులకు రూ.81,69,099 నగదు, 91 గ్రాముల 500 మిల్లీగ్రాముల మిశ్రమ బంగారం, మూడు కిలోల 500 గ్రాముల మిశ్రమ వెండి, 79 విదేశీ కరెన్సీ నోట్లు సమకూరినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో వ్యవస్థాపక ధర్మకర్త శరత్ పాఠక్, ఏఈవో సుదర్శన్ పర్యవేక్షకులు శివరాజ్, తదితరులు పాల్గొన్నారు.

108 ఈఎంటీకి ఉత్తమ సేవా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న గణేశ్

ఉట్నూర్‌రూరల్: రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న 108 సిబ్బందికి రాష్ట్ర ఎంఆర్‌ఐ సంస్థ అందించే ఉత్తమ సేవా పురస్కారానికి ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ 108లో మెడికల్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న గణేశ్ ఎంపికయ్యారు. మంగళవారం ఐటీడీఏ కార్యాలయంలో పీవో ఖుష్బూ గుప్తా చేతుల మీదుగా పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ సామ్రాట్, జిల్లా ఇన్‌చార్జి రాజశేఖర్, పైలట్ సుందర్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

రైతు నేస్తం.. వాట్సాప్ చానల్

- అధికారిక చానల్ ప్రారంభించిన వ్యవసాయ శాఖ
- అన్నదాతకు సలహాలు, సూచనలు

లక్ష్మణచాంద: పంటల సాగులో తరచూ ఎదురయ్యే తెగుళ్లు, వాటి నివారణకు సరైన మందుల ఎంపికలో అవగాహన లోపం కారణంగా రైతులు దిగుబడులు కోల్పోతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ సాంకేతికత ఆధారంగా రైతుల ముంగిట ముఖ్య సమాచారాన్ని అందించేందుకుఈ ఏడాది ఆగస్టు 8న ప్రత్యేక అధికారిక వాట్సాప్‌చానల్‌నుప్రారంభించింది.

చానల్ ద్వారా లభించే ప్రయోజనాలు

- తెగుళ్ల గుర్తింపు, నివారణకు సరైన సలహాలు
- రోగ నిరోధక వంగడాలు, గుణాత్మక విత్తనాల ఎంపికలో మార్గదర్శకత్వం
- పంటల రక్షణ, ఎరువుల వినియోగం, నీటి నిర్వహణపై సూచనలు
- వాతావరణ సమాచారం, మార్కెట్ ధరలు, ప్రభుత్వ పథకాల వివరాలు
- రాయితీ విత్తనాల లభ్యత, మౌలిక వసతులపై తాజా సమాచారం

నిపుణుల సలహాలు

రైతు సాగు చేసే పంటకు మొలక దశ నుంచి కోత దశ వరకు ఏ తెగులు వచ్చినా, దాని ఫొటోను చానల్‌లో పోస్టు చేస్తే వ్యవసాయ శాస్త్రవేత్తలు ఆ తెగుళ్లను వెంటనే గుర్తిస్తారు. తెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏ మందులు, ఏ మోతాదులో ఉపయోగించాలో వివరిస్తారు.

చానల్‌లో చేరడం ఇలా..

- రైతులు తమ క్లస్టర్ పరిధిలోని అసిస్టెంట్ అగ్రికల్చరల్ ఆఫీసర్ (ఏఈవో)ను సంప్రదించాలి.
- మొబైల్ నంబర్ అందిస్తే వారు చానల్‌లో చేర్చుతారు.

గ్రామస్థాయి అవగాహన కార్యక్రమాలు

- రైతు వేదికల ద్వారా ఇప్పటికే సమాచార కల్పన ప్రారంభమైంది



వ్యవసాయ శాఖ వాట్సప్ చానల్

- త్వరలో ప్రతీ గ్రామంలో ప్రత్యేక సదస్సులు ఏర్పాటు చేసి అవగాహన పెంపు
- అన్నదాతలు చానల్‌లో చేరేలా చర్యలు

రైతులకు మేలు



తెలంగాణ వ్యవసాయ శాఖ రూపొందించిన వాట్సాప్ చానల్ అన్నదాతలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఇందులో వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. సాగు ఖర్చులు తగ్గడంతో పాటు మంచి దిగుబడులు కూడా పొందవచ్చు. ఈ చానల్‌లో జిల్లాలోని రైతులంతా చేరాలని కోరుతున్నాం.
– అంజిప్రసాద్, డీఏవో, నిర్మల్

ఐటీఐ గేటుకు తాళం వేసి నిరసన

మంచిర్యాలఅర్బన్: 2022–24 విద్యాసంవత్సరానికి సంబంధించిన కోర్సు ఫీజు చెల్లించినప్పటికీ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో మంగళవారం డీపీ ఐటీఐ గేటుకు తాళం వేసి విద్యార్థులు నిరసన తెలిపారు. కళాశాల చైర్మన్ వచ్చారన్న సమాచారంతో వెళ్లి సర్టిఫికెట్లు అడిగితే దాటవేత సమాధానం ఇవ్వడంతో గేటు ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. పీడీఎస్‌యూ, ఏఐఎస్‌బీ, జీవీఎస్ విద్యార్థి సంఘాల నేతలు శ్రీకాంత్, వంశీ వారికి మద్దతు తెలిపారు. ఆందోళన విరమించకపోవడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కళాశాల యజమానులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లగా విద్యార్థులు, విద్యార్థిసంఘాల నేతలు కూడా అక్కడికి వెళ్లారు. కళాశాల చైర్మన్, ప్రిన్సిపాల్ మధ్య డబ్బుల వివాదంతో సర్టిఫికెట్లు ఇవ్వడంలో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. రాత్రి వరకు సర్టిఫికెట్ల సమస్య పరిష్కారంపై కొలిక్కిరాలేదు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థుల నుంచి డబ్బులు తీసుకుని సర్టిఫికెట్లు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.



నిరసన తెలుపుతున్న విద్యార్థులు



శ్రీలంక-న్యూజిలాండ్ మ్యాచ్ వర్షార్పణం

కొలంబో: మహిళల వన్డే ప్రపంచకప్‌లో మరో పోరు వర్షార్పణమైంది. కొలంబోలో నిరంతరాయంగా కురుస్తున్న వానలతో రెండోసారి శ్రీలంక ఖాతాలో ఫలితం తేలని మ్యాచ్ చేరింది. మంగళవారం న్యూజిలాండ్, శ్రీలంక మధ్య జరిగిన లీగ్ మ్యాచ్‌ను ఒక ఇన్నింగ్స్ తర్వాత భారీ వర్షం కారణంగా రద్దు చేయాల్సి వచ్చింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న లంక 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 258 పరుగులు చేసింది. నీలాక్షిక సిల్వ (28 బంతుల్లో 55 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్), చమరి అటపట్టు (72 బంతుల్లో 53; 7 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించగా... హాసిని పెరీరా (44),విష్మి గుణరత్నే (42) రాణించారు. కివీస్ బౌలర్లలో సోఫీ డివైన్ 3, బ్రీ ఇల్లింగ్ 2 వికెట్లు పడగొట్టారు. అయితే లంక బ్యాటింగ్ ముగిసిన తర్వాత మొదలైన వర్షం ఆ తర్వాత కొంచెం కూడా తెరిపిని వ్వలేదు. దాంతో న్యూజిలాండ్‌కు బ్యాటింగ్ చేసే అవకాశమే రాలేదు. చివరకు అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నెల 4న కొలంబోలోనే శ్రీలంక, ఆస్ట్రేలియా జట్ల మధ్య మ్యాచ్ కూడా ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయింది. కొలంబోలోనే నేడు జరిగే మ్యాచ్‌లో పాకిస్తాన్‌తో ఇంగ్లండ్ ఆడుతుంది.

‘ప్రపంచకప్ టోర్నీకి చాలా సమయం ఉంది’



- రోహిత్, కోహ్లి భవిష్యత్తుపై గంభీర్ వ్యాఖ్య
- రాబోయే సిరీస్‌పైనే దృష్టి పెట్టామన్న హెడ్ కోచ్


న్యూఢిల్లీ: భారత్, ఆస్ట్రేలియా మధ్య ఈ నెల 19 నుంచి మూడు వన్డేల సిరీస్ జరగనుంది. సిరీస్ ఫలితంకంటే విరాట్ కోహ్లి, రోహిత్ శర్మల గురించే ఇప్పుడు చర్చ జరుగుతోంది. చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ తర్వాత మళ్లీ ఈ సిరీస్‌తోనే బరిలోకి దిగుతున్న వీరిద్దరు ఇప్పటికే రెండు ఫార్మాట్‌ల నుంచి రిటైర్ అయి ఒక్క వన్డేలే ఆడుతున్నారు. ఈ క్రమంలో రోహిత్‌ను వన్డే కెప్టెన్సీ నుంచి కూడా తప్పించారు. ఈనేపథ్యంలో తాజా చర్చపై భారత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. ఇప్పటికిప్పుడు వారిద్దరి భవిష్యత్తుపై తానేమీ చెప్పలేనని స్పష్టం చేశాడు. ‘వన్డే వరల్డ్‌కప్‌కు ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉంది. కాబట్టి భవిష్యత్తుకంటే ప్రస్తుతంపైనే దృష్టి పెట్టడం ముఖ్యమని నేను భావిస్తా. వారిద్దరు అత్యుత్తమ ఆటగాళ్లు అనడంలో సందేహం లేదు. పునరాగమనం చేస్తున్న వారి అనుభవం ఆస్ట్రేలియాలో పనికొస్తుంది. వీరిద్దరు బాగా ఆడి సిరీస్ విజయంలో భాగమవుతారని ఆశిస్తున్నా’ అని గంభీర్ చెప్పాడు.

గిల్‌కు కెప్టెన్సీ అర్హత ఉంది...

భారత టెస్టు కెప్టెన్సీతో పాటు వన్డేలకు కూడా సారథ్యం వహించే సత్తా, అర్హత శుబ్‌మన్ గిల్‌కు ఉన్నాయని, ఈ హక్కును అతను సాధించుకున్నాడని గంభీర్ ప్రశంసించాడు. ‘కెప్టెన్‌గా గిల్‌ను నియమించి ఎవరూ ఔదార్యం చూపించలేదు. అతడికి ఆ అర్హత ఉంది. కోచ్‌గా కూడా నేను ఈ మాట చెప్పగలను. ప్రపంచ క్రికెట్‌లో అతి కఠినమైన పర్యటనల్లో ఇంగ్లండ్ ఒకటి. అలాంటి చోట ఐదు టెస్టులూ గట్టిగా నిలబడి సిరీస్‌ను సమం చేసుకోగలగడం చిన్న విషయం కాదు. బ్యాటింగ్‌లోనూ అదరగొట్టడంతో పాటు జట్టును సమర్థంగా నడిపి వన్డేల్లోనూ సారథి కాగల హక్కును అతను సాధించాడు’ అని గంభీర్ అన్నాడు. 2027 వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ గురించి ఇప్పుడే మాట్లాడటం అనవసరమని, వరుసగా విజయాలు సాధించడమే తమ లక్ష్యమని అతను స్పష్టం చేశాడు. భారత జట్టు నవంబర్ 9న ఆస్ట్రేలియాతో చివరి టెస్టు ఆడనుండగా... నవంబర్ 14 నుంచి కోల్‌కతాలో దక్షిణాఫ్రికాతో తొలి టెస్టు జరుగుతుంది. అయితే ప్రొఫెషనల్ క్రికెటర్లు తక్కువ సమయంలో పరిస్థితులకు తగినట్లుగా మార్చుకోగలరని విశ్వాసం వ్యక్తం చేసిన గంభీర్... టెస్టు టీమ్‌లో మాత్రమే సభ్యులైన ఆటగాళ్లు రంజీ ట్రోఫీలో బరిలోకి దిగాలని సూచించాడు. వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్ గెలవడం పట్ల కోచ్ సంతృప్తి వ్యక్తం చేశాడు. అయితే భారత్‌లో కూడా పేస్ బౌలర్లకు కూడా కాస్త అనుకూలించే విధంగా బౌన్సీ పిచ్‌లు ఉంటే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశాడు.

హర్షిత్ రాణాపై అనవసర విమర్శలు...

భారత జట్టు తరఫున మూడు ఫార్మాట్‌లలోనూ వరుసగా అవకాశాలు పొందుతున్న పేస్ బౌలర్ హర్షిత్ రాణాపై ఇటీవల సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ప్రతిభావంతుడు కాకపోయినా... ఢిల్లీకి చెందినవాడు కావడంతో పాటు గంభీర్ ఐపీఎల్ టీమ్ కేకేఆర్‌కు మెంటార్‌గా ఉన్న సమయంలో సాన్నిహిత్యం వల్లే రాణాకు జట్టులో చోటు దక్కుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భారత మాజీ కెప్టెన్ కృష్ణమాచారి శ్రీకాంత్ కూడా ఇటీవల ఇదే మాట అన్నాడు. తాజా విమర్శలపై గంభీర్ తీవ్రంగా స్పందించాడు. ఈ వివాదంలో హర్షిత్‌కు అతను పూర్తి మద్దతు పలికాడు. ‘యూట్యూబ్‌లో వ్యూస్ కోసం కొందరు ఒక 23 ఏళ్ల యువ ఆటగాడిని లక్ష్యంగా చేసుకున్నందుకు సిగ్గుపడాలి. రాణా తండ్రి మాజీ క్రికెటర్ కాదు. సెలక్షన్ కమిటీ మాజీ చైర్మన్ కానీ ఎన్‌ఆర్‌ఐ కానీ కాదు. అతను తన ప్రతిభను నమ్ముకొనే క్రికెట్ ఆడుతున్నాడు. ఒక ఆటగాడి ప్రదర్శన బాగా లేకుండా విమర్శించవచ్చు కానీ ఇలా వ్యక్తిగత విమర్శలు చేస్తారా. కావాలంటే నన్ను విమర్శించండి. నేను దానిని భరించగలను. కానీ 23 ఏళ్ల ఆటగాడిపై ఇది మానసికంగా ఎలాంటి ప్రభావం చూపిస్తుందో ఆలోచించారా. భారత క్రికెట్ జట్టు ఎవరిదో సొంత ఆస్తి కాదు. మన జట్టు గెలవాలని భావించే అందరిది ఈ జట్టు అని మర్చిపోవద్దు’ అని గంభీర్ వ్యాఖ్యానించాడు.



లాంఛనం ముగిసింది

రెండో టెస్టులో 7 వికెట్లతో భారత్ జయభేరి

వెస్టిండీస్‌పై 2-0తో సిరీస్ క్లీన్‌స్వీప్ ● కేఎల్ రాహుల్ అర్ధశతకం

న్యూఢిల్లీ: వెస్టిండీస్ మూడో రోజు **ఫాలోఆన్‌లో** రెండో ఇన్నింగ్స్‌తో మొదలుపెట్టిన **పోరాటం** నాలుగో రోజూ కొనసాగడం... **ఇద్దరి సెంచరీల** మైలురాయితో ఆతిథ్య భారత్ **ముందు లక్ష్యాన్ని** ఉంచడంతో ఈ చివరి టెస్టు **చివరి రోజుదాకా** సాగింది. మంగళవారం ఆటలో **భారత్ సులువైన** లక్ష్య ఛేదనలో మిగిలిపోయిన **లాంఛనాన్ని తొలి** సెషన్‌లోనే పూర్తి చేసింది. అలా **రెండో టెస్టులో** టీమిండియా 7 వికెట్ల తేడాతో **వెస్టిండీస్‌పై ఘనవి**జయం సాధించింది. భారత్ **రెండో ఇన్నింగ్స్‌లో** 35.2 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి **124 పరుగులు చేసి** గెలిచింది. ఓవర్‌నైట్ బ్యాటర్ కేఎల్ **రాహుల్ (108** బంతుల్లో 58 నాటౌట్; 6 ఫోర్లు, **2 సిక్స్‌లు) అర్ధ**శతకం సాధించాడు. రోస్టన్ చేజ్ 2 **వికెట్లు తీయగా...** వారికెన్‌కు ఒక వికెట్ దక్కింది. **రవీంద్ర జడేజాకు** ‘ప్లేయర్ ఆఫ్ ద సిరీస్’ లభించింది. **రెండు టెస్టుల్లో** ఆడిన ఒకే ఇన్నింగ్స్‌తో శతక్కొట్టిన **జడేజా 8 వికెట్లు** కూడా తీశాడు. కాగా ఈ రెండో **టెస్టులో 8 వికెట్లు** (5/82, 3/104) పడగొట్టిన **కుల్దీప్ యాదవ్‌కు** ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ అవార్డు దక్కింది.

గంటసేపు పైగా...

ఆఖరి రోజు మిగిలిపోయిన 58 పరుగులు చేసేందుకు 63/1 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ **కొనసాగించిన భారత్ కాసేపటికే సాయి సుదర్శన్ (76 బంతుల్లో 39; 5 ఫోర్లు) వికెట్‌ను కోల్పో**యింది. ఓవర్‌నైట్ బ్యాటర్ రాహుల్‌కు జతయిన కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (13) కూడా వికెట్‌ను సమర్పించుకోవడంతో లాంఛనం పూర్తి చేసేందుకు భారత్ గంటసేపు పైగానే ఆడాల్సి వచ్చింది. క్రీజులోకి ధ్రువ్ జురేల్ (6 నాటౌట్; 1 ఫోర్) రాగా... 102 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న రాహుల్ అజేయంగా **నిలిచి భారత్‌ను గెలిపించాడు. కేఎల్ రాహుల్ తొలి టెస్టులో శతకంతో కదంతొక్కాడు. ఈ క్లీన్‌స్వీప్** విజయంతో టీమిండియా ‘ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్’ పాయింట్ల పట్టికలో 61.9 శాతంతో మూడో స్థానాన్ని పటిష్టం చేసుకుంది.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 518/5 డిక్లేర్డ్; వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్: 248; వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్: 390; **భారత్ రెండో** ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ **(సి) ఫిలిప్ (బి)** వారికెన్ 8; రాహుల్ (నాటౌట్) **58; సాయి సుదర్శన్** (సి) షై హోప్ (బి) చేజ్ 39; గిల్ (సి) గ్రీవ్స్ (బి) చేజ్ 13; ధ్రువ్ జురేల్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 0; **మొత్తం** (35.2 ఓవర్లలో 3 వికెట్లకు) 124. వికెట్ల పతనం: 1-9, 2-88, 3-108. బౌలింగ్: సీల్స్ 3-0-14-0, వారికెన్ 15.2-4-39-1, పియర్ 8-0-35-0, చేజ్ 9-2-36-2.

10 వెస్టిండీస్‌పై భారత్ వరుస సిరీస్ విజయాల సంఖ్య. దక్షిణాఫ్రికా పేరిట ఉన్న ఒకే జట్టుపై వరుస సిరీస్ విజయాల రికార్డును భారత్ సమం చేసింది. దక్షిణాఫ్రికా జట్టు కూడా విండీస్‌పై వరుసగా పది సిరీస్‌లలో గెలిచింది.

14 ఢిల్లీ గడ్డపై టీమిండియా అజేయ రికార్డు. భారత్ 1993 నుంచి ఇక్కడ ఆడిన 14 మ్యాచ్‌ల్లో ఒక్కటి కూడా ఓడలేదు. 12 టెస్టులు గెలువగా, రెండు ‘డ్రా’ అయ్యాయి.

122 సొంతగడ్డపై భారత్ గెలిచిన టెస్టులు. సంప్రదాయ క్రికెట్ చరిత్రలోనే ఇది మూడో అత్యధికం. ఆస్ట్రేలియా (262), ఇంగ్లండ్ (241) మాత్రమే ముందున్నాయి.

భారత్-పాకిస్తాన్ హాకీ మ్యాచ్ ‘డ్రా’



జొహోర్ (మలేసియా): సుల్తాన్ ఆఫ్ జొహోర్ కప్ అండర్-21 అంతర్జాతీయ జూనియర్ హాకీ టోర్నీలో భారత్ ఖాతాలో తొలి ‘డ్రా’ చేరింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో మంగళవారం జరిగిన మూడో లీగ్ మ్యాచ్‌ను భారత జట్టు 3-3 గోల్స్‌తో ‘డ్రా’గా ముగించింది. భారత్ తరఫున అరిజీత్ సింగ్ (43వ నిమిషంలో), ఆనంద్ (47వ నిమిషంలో), మన్‌మీత్ (53వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. పాకిస్తాన్ తరఫున హన్నాన్ షాహిద్ (5వ నిమిషంలో) ఒక గోల్.. సుఫియాన్ ఖాన్ (39వ, 55వ నిమిషంలో) రెండు గోల్స్ చేశాడు. ఆరు జట్లు పోటీపడుతున్న ఈ టోర్నీలో భారత్ ఏడు పాయింట్లతో ఆస్ట్రేలియాతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉంది.

ఆసియా కప్ ఆశలు గల్లంతు

సింగపూర్ చేతిలో ఓడిన భారత్



మార్గావ్: ఆసియా కప్-2027 ఫుట్‌బాల్ టోర్నీకి అర్హత సాధించడంలో భారత్ విఫలమైంది. క్వాలిఫికేషన్ టోర్నీలో రెండో పరాజయంతో జట్టు నిష్క్రమణ ఖాయమైంది. మంగళవారం జరిగిన గ్రూప్ ‘సి’ మ్యాచ్‌లో సింగపూర్ 2-1 గోల్స్ తేడాతో భారత్‌ను ఓడించింది. సింగపూర్ తరఫున సంగ్ యు యంగ్ 44వ, 58వ నిమిషాల్లో గోల్స్ నమోదు చేశాడు. భారత్ తరఫున లాలియన్‌జుల చాంగ్తే 14వ నిమిషంలో ఏకైక గోల్ సాధించాడు. గ్రూప్ ‘సి’లో టీమిండియా చివరి స్థానంలో ఉంది. గ్రూప్ విజేత మాత్రమే ఆసియా కప్‌కు అర్హత సాధిస్తుంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

అందుకు తెగించే ఇక్కడ ఉన్నాను



- సిద్ధు జొన్నలగడ్డ

‘‘నేను ఏ సినిమా చేసినా నాపై నాకే ఎక్స్‌పెక్టేషన్స్ ఎక్కువగా ఉంటాయి. ఇప్పుడే డీటీఎస్‌లో ‘తెలుసు కదా’ సినిమా చూశాను. చాలా ఎగ్జైట్ అయ్యాను. ఇదే ఎగ్జైట్ మెంట్‌ని ఆడియన్స్ కూడా ఫీలవుతారని అనుకుంటున్నా’’ అని సిద్ధు జొన్నలగడ్డ అన్నారు. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించిన చిత్రం ‘తెలుసు కదా’. ఈ చిత్రంలో రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటించారు. నీరజా కోన దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 17న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం విలేకరుల సమావేశంలో సిద్ధు జొన్నలగడ్డ చెప్పిన విశేషాలు.

● ‘తెలుసు కదా’లో నేను వరుణ్ పాత్రలో కనిపిస్తాను. స్క్రీన్‌పై వరుణ్ మామూలుగా కనిపిస్తున్నప్పటికీ అతని ఆలోచనలు చాలా ర్యాడికల్‌గా ఉంటాయి. ఈ క్యారెక్టరైజేషన్ చూసి, ఆడియన్స్ షాక్ అవుతారనుకుంటున్నాను. ఫస్టాఫ్‌లో శ్రీనిధి, సెకండాఫ్‌లో రాశీ క్యారెక్టర్స్ బలంగా కనిపిస్తాయి. వీరిద్దరి కంటే వరుణ్ రోల్ ఇంకా స్ట్రాంగ్‌గా ఉంటుంది. ● కొత్తవాళ్లతో వర్క్ చేయడం రిస్క్‌తో కూడుకున్న పనే. కానీ రిస్క్ ఉన్న చోటే రివార్డు కూడా ఉంటుంది. నీరజగారి ఐడియాలు బాగున్నాయి. కాకపోతే హీరో క్యారెక్టరైజేషన్‌ను కాస్త ఇంప్రూవ్ చేసిన తర్వాత షూటింగ్‌కు వెళ్లాం. డబ్బుల గురించి ఆలోచించకుండా మంచి సినిమా తీయమని ప్రోత్సహించే నిర్మాత టీజీ విశ్వప్రసాద్‌గారు. అందుకే విజువల్‌గా ‘తెలుసు కదా’ స్క్రీన్‌పై పెద్ద సినిమాలా కనిపిస్తుంది. ● సినిమా మేకింగ్‌లో జోక్యం చేసుకుంటున్నానంటే నా కోసం ఎవరూ కథలు రాయలేదు. నా కథలు నేనే రాసుకున్నాను. ఫిల్మ్ మేకింగ్ గురించిన ప్రతి విషయాన్ని నేర్చుకున్నాను. ఒకవేళ సినిమా హిట్టయితే డైరెక్షన్, మ్యూజిక్, సినిమాటోగ్రఫీ, హీరో హీరోయిన్ల యాక్టింగ్... ఇలా అన్నీ బాగున్నాయి అంటారు. అదే ఫ్లాప్ అయితే నేను ఇన్‌వాల్వ్ అయ్యాను కాబట్టి పోయిందని నిందిస్తారు. ఇందుకు తెగించే ఇక్కడ ఉన్నాను. ● నేను హీరోగా నటించిన ‘డీజే టిల్లు, డీజే టిల్లు 2’ సినిమాలు సూపర్‌హిట్స్‌గా నిలిచాయి. ఈ డీజే టిల్లు క్యారెక్టరైజేషన్ ‘హై’ వల్ల నా సినిమాలు ఒకట్రెండు ఫలితాలు తారుమారు కావొచ్చని ముందే ఊహించాను. ‘జాక్’ సినిమా ఆడియన్స్‌ను మెప్పించలేకపోయింది. అప్పుడు కొరటాల శివగారు ఫోన్ చేసి, ‘డీజే టిల్లు’ హిట్స్‌తో ఆల్ టైమ్ ‘హై’ చూశావ్... ‘జాక్’తో ‘లో’ చూశావ్. ఇక నువ్వేం చేసినా ఆ రెండింటి మధ్య చూస్తావు’’ అన్నారు. ఆ మాటలు నాలో కొత్త ఆలోచనలు కలిగించాయి. ● ఇటీవల ఓ ఇబ్బందికర ప్రశ్న ఎదుర్కొన్నాను. సినిమాల్లో హీరో పోలీసాఫీసర్ అయితే రియల్‌గానూ పోలీస్‌గా ఉంటారా? హీరో డ్రగ్ ఎడిక్ట్ అయితే రియల్ లైఫ్‌లోనూ డ్రగ్ ఎడిక్టై ఉంటారా? అది సినిమా. హీరో ఆన్సర్ చేసే పొజిషన్‌లో ఉన్నాడు కదా అని ఏది పడితే అది అడిగేయడం కరెక్ట్ కాదు. ● ‘తెలుసు కదా’ ప్రమోషన్స్‌లో భాగంగా రవితేజగారి బయోపిక్ చేయాలని ఉందని చెప్పాను... చూడాలి. ఇక నాకు డైరెక్టర్‌గా మారే ఆలోచన కూడా ఉంది. హీరోగా నా తర్వాతి సినిమా ‘బ్యాడాస్’ కొత్తగా ఉంటుంది. మల్లిక్ రామ్‌తో ఓ సినిమా చేయాల్సి ఉంది.

ఫ్లాష్‌బ్యాక్‌లో యాక్షన్



● ఎన్టీఆర్

ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘ఎన్టీఆర్ నీల్’ (వర్కింగ్ టైటిల్). ‘కేజీఎఫ్, సలార్’ చిత్రాల తర్వాత డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్న సినిమా ఇది. రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్స్‌పై కల్యాణ్ రామ్ నందమూరి, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్న పాన్ ఇండియా చిత్రమిది. ఈ సినిమాలో వచ్చే ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్స్ కోసం ఎన్టీఆర్ ఓ డిఫరెంట్ లుక్‌లోకి మారారని టాక్. ఫ్లాష్‌బ్యాక్‌లో వచ్చే పవర్‌ఫుల్ యాక్షన్ సన్నివేశాలు సినిమాలో హైలైట్‌గా నిలవనున్నాయట. ఇదిలా ఉంటే... ఈ సినిమాకి ‘డ్రాగన్’ అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు ఫిల్మ్ నగర్ టాక్. ఈ చిత్రం 2026 జూన్ 25న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

‘వార్ 2’ రికార్డ్ : హృతిక్ రోషన్, ఎన్టీఆర్, కియారా అద్వానీ ముఖ్య తారలుగా నటించిన చిత్రం ‘వార్ 2’. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్ రాజ్ ఫిల్మ్స్‌పై ఆదిత్య చోప్రా నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 14న విడుదలైంది. ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ వేదికగా ఈ నెల 6 నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. అత్యధిక మంది వీక్షించిన చిత్రాల జాబితాలో ‘వార్ 2’ చిత్రం టాప్‌లో ఉన్నట్లు ప్రముఖ మీడియా సంస్థ ఆర్మ్యాక్స్ తెలిపింది. ఈ నెల 6 నుంచి 12 వరకూ 3.5 మిలియన్ల మంది వీక్షించినట్లు ఆ సంస్థ ప్రకటించింది. దీంతో గత వారం ఇండియాలోనే ఎక్కువ మంది చూసిన సినిమాగా ‘వార్ 2’ నిలిచింది.

కుందేలుకి కోపం వస్తే..!



● చిరంజీవి, నయనతార

‘‘మీసాల పిల్లా నీ ముక్కు మీద కోపం కొంచెం తగ్గాలే పిల్లా... మీసాల పిల్లా నీ ముక్కు మీద కోపం కొంచెం తగ్గాలే పిల్లా... పొద్దునలేచిన దగ్గర్నుంచి డైలీ యుద్ధాలా... మొగుడు పెళ్లాలంటే కంకి కొడవల్లా... అట్ట కన్నెర చెయ్యాలా... కారాలే నూరేలా...’’ అంటూ సాగుతుంది ‘మీసాల పిల్లా...’ పాట. చిరంజీవి హీరోగా నటిస్తున్న ‘మన శంకరవరప్రసాద్‌గారు’ సినిమాలోనిది ఈ పాట. ఈ చిత్రంలో నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇందులో చిరంజీవి, నయనతార భార్యా భర్తలుగా కనిపిస్తారు. ఈ సినిమాలోని ‘మీసాల పిల్లా...’ పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. భీమ్స్ సిసిరోలియో స్వరపరచిన ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందించగా ఉదిత్ నారాయణ్ ఆలపించారు. ‘‘ఇట్ట దుమ్మెత్తి పొయ్యాలా దూరాలె పెంచేలా... కుందేలుకి కోపం వస్తే చిరుతకు చెమటలు పట్టేలా...’ అంటూ ఈ పాట సాగుతుంది. అర్చన సమర్పణలో అనిల్ రావిపూడి దర్శకత్వంలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్న ‘మన శంకరవరప్రసాద్‌గారు’ సినిమా వచ్చే సంక్రాంతి సందర్భంగా విడుదల కానుంది.

కబడ్డీ... కబడ్డీ



● ధ్రువ్

ప్రముఖ తమిళ హీరో విక్రమ్ తనయుడు ధ్రువ్ హీరోగా అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటించిన చిత్రం ‘బైసన్’. మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించారు. పా. రంజిత్ సమర్పణలో నీలం స్టూడియోస్, అప్లాజ్ ఎంటర్‌టైన్మెంట్‌పై సమీర్ నాయర్, దీపక్ సెగల్, పా. రంజిత్, అదితీ ఆనంద్ నిర్మించిన ఈ చిత్రం తమిళంలో ఈ నెల 17న విడుదల కానుంది. తెలుగులో జగదాంబే ఫిలిమ్స్ పై బాలాజీ ఈ నెల 24న విడుదల చేస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్‌ను హీరో రానా రిలీజ్ చేసి, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ– ‘‘1990 బ్యాక్‌డ్రాప్‌లో కబడ్డీ నేపథ్యంలో రూపొందిన చిత్రం ‘బైసన్’. ట్రైలర్ ఎంత ఆసక్తికరంగా ఉందో సినిమా కూడా థ్రిల్లింగ్ అంశాలతో అందర్నీ ఆకట్టుకునేలా ఉంటుంది. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ సినిమాలకు తెలుగులో మంచి ఆదరణ దక్కుతుంది. కబడ్డీ నేపథ్యంలో రాబోతున్న మా సినిమా కూడా మంచి విజయం అందుకుంటుందని నమ్ముతున్నాను’’ అన్నారు.

ఫ్యామిలీ ఆడియన్స్ చూడొచ్చు

- నిర్మాత రాజేశ్ దండ

‘‘నిర్మాతగా ‘కె-ర్యాంప్’ నాకు ఆరవ సినిమా. నా గత ఐదు చిత్రాల్లో ఎక్కడా ఇబ్బందికరమైన పదాలు లేవు. ఒక్కో సినిమా కథ ఒక్కోలా ఉంటుంది. అంతే కానీ కావాలని కొన్ని పదాలు పెట్టి, ప్రేక్షకులను థియేటర్స్‌కు రప్పించాలని అనుకోను. అలాంటి సినిమాలు నేను తీయను. ‘కె-ర్యాంప్’ చిత్రం ఫ్యామిలీ ఆడియన్స్ చూడొచ్చు’’ అని చెప్పారు నిర్మాత రాజేశ్ దండ. కిరణ్ అబ్బవరం, యుక్తీ తరేజా హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం ‘కె-ర్యాంప్’. జైన్స్ నాని దర్శకత్వంలో రాజేశ్ దండ, శివ బొమ్మకు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో రాజేశ్ దండ మాట్లాడుతూ– ‘‘ఈ చిత్రంలో కిరణ్‌గారు కుమార్ అబ్బవరం అనే పాత్రలో నటించారు. ఈ సినిమా కథ విని ఎగ్జైట్ అయ్యాను. మా సినిమాకు సెన్సార్ వాళ్ళు ‘ఏ’ సర్టిఫికెట్ ఇచ్చింది ఇందులో ఇబ్బందికరమైన పదాలు ఉన్నాయని కాదు. ఈ చిత్రంలో కొన్ని సన్నివేశాలు ఉన్నాయి. వీటిని చూసి ఎవరైనా ఆడియన్స్ ప్రేరణ పొందుతారేమోనని ‘ఏ’ సర్టిఫికెట్ ఇచ్చారు... అంతే. వల్గారిటీ లేదు. ఇక ‘కె-ర్యాంప్’ సినిమా కిరణ్‌గారి వన్ మ్యాన్ షోలా ఉంటుంది. ఇంట్రవెల్ బ్యాంగ్ బ్లాస్ట్ అవుతుంది. ఈ సినిమాతో నిర్మాత శివతో నాకు మంచి ప్రయాణం మొదలైంది. నా మీద నమ్మకంతో కథ వినకుండానే ఈ సినిమాలో భాగమయ్యారు శివ. ప్రస్తుతం మా బ్యానర్‌లో హీరోయిన్ సంయుక్తతో ఓ సినిమా చేస్తున్నాం. అలాగే ‘అల్లరి’ నరేశ్‌గారితో ఓ సినిమా ఉంది’’ అని అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ‘‘టార్గెటెడ్ ట్రోలింగ్ గురించి బన్నీ వాసుగారు మాట్లాడిన విషయాలను నేను ఫాలో కాలేదు. పూర్తి విషయాలు తెలిసిన తర్వాత స్పందిస్తాను’’ అని చెప్పారు. ‘‘కిరణ్‌గారిని ఈ సినిమాలో కొత్తగా చూస్తారు. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా ఈ సినిమా ఉంటుంది’’ అన్నారు శివ బొమ్మకు.



● రాజేశ్ దండ, శివ బొమ్మకు

అరి కథతో పుస్తకం తీసుకొస్తున్నాం

- జయశంకర్

‘‘అరిషడ్వర్గాల గురించి ఎంతోమంది గొప్పవాళ్లు చెబుతూ వచ్చారు. కానీ, వాటికి పరిష్కారం చూపించలేదు. ఈ ఆలోచనతోనే ‘అరి’ చిత్రాన్ని రూపొందించాను. ఈ సినిమా కథతో త్వరలోనే పుస్తకాన్ని తీసుకొస్తున్నాం’’ అని దర్శకుడు జయశంకర్ చెప్పారు. వినోద్ వర్మ, అనసూయ, సాయి కుమార్, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం ‘అరి’. రామిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి (ఆర్‌వీ రెడ్డి) సమర్పణలో శ్రీనివాస్ రామిరెడ్డి, డి. శేషురెడ్డి మారంరెడ్డి, డా. తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, బీరం సుధాకర్ రెడ్డి నిర్మించారు. ఏషియన్-సురేష్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా ఈ నెల 10న విడుదలైంది. ఈ సినిమా సక్సెస్ మీట్‌లో జయశంకర్ మాట్లాడుతూ– ‘‘మా సినిమాకి స్లోగా ఓపెనింగ్స్ వచ్చి పికప్ అవుతుందనుకున్నాం. అయితే శ్రీకాంత్ అయ్యంగార్ ఇష్యూ వల్ల రెండో రోజునే మా సినిమా పోస్టర్స్‌ను థియేటర్స్ దగ్గర చించివేయడం బాధగా అనిపించింది. ఆ తర్వాత ఆ వివాదం సద్దుమణిగింది. మూడో రోజు నుంచి మా సినిమాకి ప్రేక్షకుల సందడి కనిపించింది’’ అని పేర్కొన్నారు. ‘‘పేపర్ బాయ్’లో అవకాశం ఇచ్చి, నాకు గుర్తింపు తీసుకొచ్చిన జయశంకర్‌గారు ఇప్పుడు ‘అరి’లో లీడ్ రోల్ ఇచ్చి మరింత గుర్తింపు తెచ్చుకునేలా చేసినందుకు థ్యాంక్స్’’ అని నటుడు వినోద్ వర్మ తెలిపారు.



● వినోద్ వర్మ, జయశంకర్

సస్పెన్స్ సీమంతం



● సుధాకర్, ఆర్పీ పట్నాయక్

‘‘ప్రస్తుతం సమాజంలో నెలకొన్న ఓ ప్రధానమైన సమస్య నేపథ్యంలో రూపొందిన ‘సీమంతం’ సినిమా మంచి విజయం సాధించాలి. ‘ఎద మాటున...’ పాట బాగుంది. ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలి’’ అని సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ తెలిపారు. వజ్రయోగి, శ్రేయ భర్తీ జంటగా సుధాకర్ పాణి దర్శకత్వం వహించిన చిత్రం ‘సీమంతం’. ప్రశాంత్ టాటా నిర్మించిన ఈ సినిమా నవంబరు 14న విడుదల కానుంది. ఎస్. సుహాస్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి ‘ఎద మాటున...’ అంటూ సాగే పాటని ఆర్పీ పట్నాయక్ రిలీజ్ చేశారు. ‘‘సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం ‘సీమంతం’. గర్భవతులపై దాడుల నేపథ్యంలో కథ సాగుతుంది’’ అని యూనిట్ పేర్కొంది.